క్లుప్తంగా

ఆర్థికసాయం



సునీతకు నగదు అందజేస్తున్న శ్రీనివాసరావు

మక్కువ: మండల కేంద్రంలోని ఆర్‌సీఎం వీధికి చెందిన దేవులపల్లి సునీతకు ఎంఎస్‌ఆర్ ఫౌండేషన్ అధ్యక్షుడు మరడ శ్రీనివాసరావు సోమవారం ఆర్థికసాయం చేశారు. సునీతకు ఇటీవల పెళ్లి కుదిరింది. అయితే సునీతకు తల్లిదండ్రులు లేకపోవడంతో ఫౌండేషన్ తరపున రూ. పదివేలు అందజేశారు.

నేడు విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక

మక్కువ: సాలూరు – మక్కువ రోడ్డులో గల ట్రాన్స్‌కో కార్యాలయం వద్ద విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక మంగళవారం నిర్వహించనున్నట్లు ఏఈ శాంతారావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి సీజీఆర్‌ఎఫ్ చైర్మన్ బి.సత్యనారాయణ, కమిటీ సభ్యులు, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పూడి హరి, తదితరులు హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. వినియోగదారులు తమ సమస్యలను తెలియజేసుకోవచ్చన్నారు.

'మిషన్ అంత్యోదయ'తో గ్రామాలు అభివృద్ధి



ఎర్రసామంతవలసలో నిర్వహిస్తున్న గ్రామసభ

మక్కువ: మిషన్ అంత్యోదయ కార్యక్రమంతో గ్రామీణ ప్రాంతాలు అభివృద్ధి చెందుతాయని పంచాయతీ కార్యదర్శి గణేష్ తెలిపారు. మండలంలోని పనసబద్ర పంచాయతీ ఎర్రసామంతవలసలో సోమవారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పంచాయతీలకు సంబంధించి ఆరోగ్యం, పౌష్టికాహారం, సామాజికభద్రత, సుపరిపాలన, నీటి నిర్వహణ, తదితర 29 అంశాలలో సమాచారాన్ని సేకరించి ఆన్‌లైన్‌లో పొందుపరచాలని సూచించారు. దీంతో గ్రామాన్ని అభివృద్ధి చేసేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు.

చలివేంద్రాల ఏర్పాటు

మక్కువ: వేసవికాలం దృష్ట్యా ప్రజలకు తాగునీరు అందించాలనే ఉద్దేశంతో కలెక్టర్ ఆదేశాల మేరకు సచివాలయాల పరిధిలో చలివేంద్రాలు ఏర్పాటు చేశారు. మండలంలోని నంద, చప్పబుచ్చమ్మపేట, వెంకటభైరిపురం, తదితర గ్రామాలలో ఏర్పాటు చేసిన చలివేంద్రాలను సర్పంచ్‌లు రమేష్, జయలక్ష్మి, వెంకటరత్నం సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు.

300పశువులకు గాలి కుంటు నివారణ టీకాలు



అంపావల్లిలో పశువులకు టీకాలు వేస్తున్న వైద్యాధికారి గణేష్

బలిజిపేట: మండల పశువైద్యాధికారి గణేష్ ఆధ్వర్యంలో అంపావల్లి గ్రామంలో 300పశువులకు గాలికుంటువ్యాధి టీకాలు వేశారు. వ్యాధి సోకకుండా ముందస్తుగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. పశువుల నోటివెంట చొంగకారడం, నాలికపై బొబ్బర్లు, అధిక జ్వరం, మేత తీసుకోకపోవడం, పాల ఉత్పత్తి తగ్గిపోవడం, కాలిగిత్తల మధ్య పుళ్లు వంటి వ్యాధి లక్షణాలు ఉంటాయని అవి సోకితే పశువులకు వ్యాధి లక్షణాలు ఉన్నట్లు గుర్తుంచుకోవాలని సూచించారు. ప్రభుత్వం నిర్ధారించిన ప్రకారం ప్రతి గ్రామంలో పశువులకు టీకాలు వేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

50 మద్యం బాటిళ్లు స్వాధీనం



పట్టుబడిన కారు, మద్యం బాటిళ్లతో పోలీసులు

సాలూరు: మద్యం బాటిళ్లతో పట్టుబడిన నిందితుడిని సోమవారం జుడీషియల్ రిమాండ్‌కు తరలించినట్లు రూరల్ ఎస్సై ప్రయోగమూర్తి తెలిపారు. మండలంలోని దేవుబుచ్చింపేట సమీపంలో ఆదివారం సాయంత్రం తనిఖీలు నిర్వహిస్తుండగా... కె. తిరుపతిరావు అనే వ్యక్తి కారులో 50 బాటిళ్లు తరలిస్తూ పట్టుబడ్డాడు. కారును సీజ్ చేయడంతో పాటు నిందితుడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

సీతంరాజును అత్యధిక మెజారిటీతో గెలిపించాలి



పార్వతీపురం టౌన్: ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచార కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే జోగారావు

- ఎమ్మెల్యే అలజంగి జోగారావు

పార్వతీపురం టౌన్: వైఎస్సార్‌సీపీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌ను ఎన్నికలలో అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఎమ్మెల్యే అలజంగి జోగారావు కోరారు. ఈ మేరకు సోమవారం పురపాలక సంఘంలోని 14వ వార్డులో ఎమ్మెల్సీ ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర జిల్లాల ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్ అభ్యర్థిత్వాన్ని బలపరచాలని కోరారు. విద్యావంతులు, యువకులు ఉత్తరాంధ్ర జిల్లాల ఎమ్మెల్సీగా నామినేషన్ సమర్పించిన సీతంరాజు సుధాకర్‌ను రాబోయే ఎన్నికల్లో అత్యధిక మెజారిటీతో గెలిపించేలా ఓట్లు వేయాలని కోరారు. మొదటి ప్రాధాన్యత క్రమం ఓట్1 సీతంరాజు పేరు ఎదురుగా వేయాలని గ్రాడ్యుయేట్ ఓటర్లందరినీ అభ్యర్థించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి, వైస్ చైర్‌పర్సన్ కె రుక్మిణి, మున్సిపల్ వైస్‌చైర్మన్ యిండుపూరు గున్నేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు కొండపల్లి బాలకృష్ణ, జేసీఎస్ కన్వీనర్ గొర్లి మాధవరావు, కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు గ్రాడ్యుయేట్ ఓటర్లు తదితరులు పాల్గొన్నారు.

సీతానగరంలో..

సీతానగరం: వైఎస్సార్‌సీపీ బలపరుస్తున్న ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌కు ఓటర్లు తమ మొదటి (1)ప్రాధాన్యత ఓటువేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఏపీ టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్ కోరారు. ఈ మేరకు సోమవారం ఆయన మండలంలోని బూర్జలో వ్యవసాయ సలహామండలి జిల్లా చైర్మన్ వి నాగేశ్వరరావును ఏపీ టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్ మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. అనంతరం గ్రామాల్లో చేస్తున్న ప్రచారంలో భాగంగా వెంకటాపురంలో మాజీ సర్పంచ్ బి గౌరునాయుడు, పార్టీ సీనియర్ నాయకులు బి అప్పలనాయుడులను కలిసి సీతంరాజు సుధాకర్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించడానికి అందరూ కలిసి పని చేయాలని కోరారు. కార్యక్రమంలో నిడగల్లు మాజీ సర్పంచ్ జి వెంకట నాయుడు, వైఎస్సార్‌సీపీ మండల నాయకులు బి ముకుందరావు, పార్వతీపురం మండల నాయకులు చుక్క లక్ష్మునాయుడు, సింహాచలం, రమేష్, వి.అప్పలనాయుడు, గ్రాడ్యుయేట్ ఓటర్లు పాల్గొన్నారు. అలాగే సీతంరాజు సుధాకర్‌కు మద్దతుగా మండలంలోని నిడగల్లు, ఇప్పలవలస పాపమ్మవలస గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ మండల నాయకులు ప్రచారం చేశారు. ఈ మేరకు వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బి.చిట్టిరాజు, జెడ్పీటీసీ ఎం బాబ్జీ మాట్లాడుతూ ఉద్యోగులు, విద్యార్థులు ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ టి.సూర్యనారాయణ, పార్టీ నాయకులు పి.ఈశ్వరనారాయణ, బి.గౌరునాయుడు, జి. శ్రీనివాసరావు, పార్థసారథి, వై గోపాలనాయుడు, డి.నాగరత్నం పాల్గొన్నారు.



బలిజిపేట: తుమరాడలో ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



సీతానగరం: వ్యవసాయ సలహామండలి చైర్మన్ నాగేశ్వరరావుతో మాట్లాడుతున్న జమ్మాన ప్రసన్నకుమార్



సాలూరు : ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

బలిజిపేటలో..

బలిజిపేట: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా వైఎస్సార్ సీపీ బలపరుస్తున్న అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌ను గెలిపించాలని జెడ్పీటీసీ రవికుమార్ కోరారు. వైఎస్సార్‌సీపీ మండల నాయకుల ఆధ్వర్యంలో తుమరాడలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మురళీకృష్ణ, మండల ఉపాధ్యక్షుడు సాయిరాం, మండల వ్యవసాయ సలహా సంఘం అధ్యక్షుడు గంగయ్య, ఎంపీటీసీ మురళి, కె.శ్రీరామూర్తి, కె.లక్ష్మణరావు, ఎం.శివుడునాయుడు, కె.ఈశ్వరరావు, వి.నారాయణస్వామి, కె.జయరాం, టి.సత్యవతి, జి.జగన్, కె.వెంకటరమణ, పి.నారాయణరావు, ఎస్.భాస్కరరావు, టి.ప్రసాద్ పాల్గొన్నారు.

సీతంరాజును గెలిపించండి..

సాలూరు: ఉత్తరాంధ్ర ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ బలపర్చిన సీతంరాజు సుధాకర్‌కు మొదటి ప్రాధాన్యం ఓటు వేసి గెలిపించాలని ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు కోరారు. ఈ మేరకు పట్టణంలో సోమవారం విస్తృత ప్రచారం నిర్వహించారు. సుధాకర్‌ను గెలిపించి ఉత్తరాంధ్ర అభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

గురుకులంలో ప్రవేశాలకు దరఖాస్తులాహ్వానం

సీతానగరం: ఏపీ బాలయోగి సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలలో 2023–24 విద్యాసంవత్సరంలో ఐదవ తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ప్రిన్సిపాల్ కె.ఈశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్సీ, ఎస్టీ బాలురు 1.9.2010 నుంచి 31.8.2014 లోపు బీసీ, బీసీ–సి, ఓసీ బాలురు 1.9.2012 నుంచి 31.8.2014 లోపు జన్మించిన వారు అర్హులని పేర్కొన్నారు. బాలురు ఇదే జిల్లాలో ప్రభుత్వ లేదా ప్రభుత్వ గుర్తింపుపొందిన పాఠశాలలో 20021–22విద్యా సంవత్సరంలో మూడో తరగతి, 2022–23లో నాలుగో తరగతి చదువు పూర్తి చేసి ఉండాలని, తల్లి, తండ్రి లేదా సంరక్షకుడి వార్షిక ఆదాయం లక్ష రూపాయలకు మించి ఉండకూడదని వివరించారు. అర్హులైన అభ్యర్థులు ఏపీజీపీసెట్.ఏపీసీఎఫ్ఎస్ఎస్.ఇన్ ద్వారా మార్చి 24లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆబ్జెక్టివ్ విధానంలో తెలుగు 10 మార్కులు, ఇంగ్లిష్ 10, గణిత 15, ఎన్విరాన్‌మెంట్ సైన్స్ 15, మొత్తం 50 మార్కు లకు పరీక్ష నిర్వహించి, మార్కుల ఆధారంగా రూల్ ఆఫ్ రిజర్వేషన్ ప్రకారం సీట్లు కేటాయించనున్నట్లు పేర్కొన్నారు. దరఖాస్తు చేసేందుకు సహాయం కోసం కార్యాలయంలో అన్ని పనిదినాల్లో సంప్రదించవచ్చని సూచించారు.

రెండెకరాల జీడితోట దగ్ధం



అగ్ని ప్రమాదంలో కాలిపోయిన జీడి, మామిడి తోట

భామిని: మండలంలోని బాలేరు–లక్ష్మీపూర్ గ్రామాల మధ్య గల రెండు ఎకరాల జీడి, మామిడి తోట అగ్ని ప్రమాదానికి గురై కాలిపోయింది. బాలేరుకు చెందిన రైతు కాసిన కోటేశ్వరరావు తోటలో జీడిచెట్లతో పాటు, మామిడి, నీలగిరి, వెదురు చెట్లు ఆహుతయ్యాయి. పంటలు చేతికి వచ్చే తరుణంలో ప్రమాదం జరగడంతో సుమారు రెండు లక్షల రూపాయల తోటలు నష్టపోయామని కుటుంబసభ్యులు వాపోతున్నారు. రెండు రోజుల క్రితం రైతు కోటేశ్వరరావు తన సోదరుడి గృహప్రవేశానికి హైదరాబాద్ వెళ్లిన సమయంలో ప్రమాదం జరగడం అనుమానాలకు తావిస్తోంది.

పంటల సేకరణ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

- జిల్లా ఉద్యానవన శాఖాధికారి శ్రీనివాసరెడ్డి

పాచిపెంట: పంటల సేకరణ కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఉద్యానవన శాఖాధికారి శ్రీనివాసరెడ్డి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమీపంలో నిర్మిస్తున్న పంటల సేకరణ కేంద్రాన్ని సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, రైతులు పండించిన పంటలను ఇక్కడ శుద్ధి చేసి అనంతరం రవాణా చేసుకోవచ్చన్నారు. ఇలాంటి కేంద్రాలు జిల్లాలో 21 నిర్మిస్తున్నట్లు చెప్పారు. వీటితో పాటు మరో 10 కోల్డ్ స్టోరేజ్ భవనాలు కూడా నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఈయన వెంట మండల ఉద్యానవనశాఖ అధికారి ప్రత్యూష ఉన్నారు.

తల్లిదండ్రుల సమావేశం

సీతంపేట: స్థానిక గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమపాఠశాలలో సోమవారం విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. హెచ్ఎం ఎ.లిల్లీరాణి విద్యార్థుల ప్రోగ్రెస్‌ను వారి తల్లిదండ్రులకు వివరించారు. పదోతరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం పెడుతున్నామని వివరించారు.

అభివృద్ధి పనుల పరిశీలన

బలిజిపేట: మండలంలోని బర్లి, సుభద్ర గ్రామాల్లో, సీతానగరం మండలం లచ్చయ్యపేట, నిడగల్లు గ్రామాల్లో జిల్లా పంచాయతీ రాజ్ ఇంజినీరింగ్ అధికారి కృష్ణాజీ బృందం సోమవారం పనులు పరిశీలించింది. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా సచివాలయాలకు మంజూరైన నిధులతో నిర్వహించిన సీసీ రోడ్లు, కాలువలు, బర్లిలో సచివాలయం నిర్మాణ పనులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పనులలో ఎక్కడా నాణ్యతాలోపం కనిపించరాదని త్వరగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో డీఈఈ రత్నంకుమార్, ఏఈ శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.



సుభద్రలో పనులు పరిశీలిస్తున్న ఇంజనీరింగ్ అధికారులు

ఉపాధి పనుల్లో సమయ పాలన పాటించాలి



వేతనదారులతో మాట్లాడుతున్న ఏపీఎం భాను

సీతానగరం: మండలంలో ఉపాధి హామీ పనుల్లో పాల్గొనే వారంతా సమయ పాలన, మార్కింగ్ విధానంతో పనులు చేపట్టి నిర్దేశించిన వేతనం గిట్టుబాటు అయ్యేలా పనులు చేపట్టాలని ఏపీఓ భాను సూచించారు. ఈ మేరకు సోమ వారం కృష్ణారాయపురంలో జరుగుతున్న ఉపాధి పనులు, మస్తరు విధానంపై ఆరాతీశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలో ఉపాధిహామీ పథకం ద్వారా చేపట్టే పనులను పరిశీలించడంతో పాటు, చేయనున్న పనులకు మార్కింగ్ ఇచ్చి, సమయ పాలన పాటించేలా టెక్నికల్ సహాయకులు, క్షేత్ర సహాయకులు వేతనదారులకు అవగాహన కల్పించాలని సూచించారు. అలాగే జాబ్ కార్డులు పొందిన వేతనదారులందరికీ ఉపాధి పనులు కల్పిస్తామని భరోసా ఇచ్చారు. ప్రజావసరాలకు అనుకూలంగా ఆయా ప్రాంతాల్లో ఉపాధి పనులు కల్పించడానికి చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. కార్యక్రమంలో మేట్‌లు, క్షేత్ర సహాయకులు పాల్గొన్నారు.

మహిళలకు రక్షణ కల్పించాలి



మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా కమిటీ అధ్యక్షురాలు దాలమ్మ

- సీఐటీయూ జిల్లా అధ్యక్షురాలు దాలమ్మ

బలిజిపేట: మహిళలకు అన్ని విధాలా రక్షణ కల్పించడం ఎంతో అవసరమని ఆరోజే అసలైన మహిళా దినోత్సవం అవుతుందని సీఐటీయూ జిల్లా కమిటీ అధ్యక్షురాలు దాలమ్మ అన్నారు. మార్చి 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా బలిజిపేట సీఐటీయూ కార్యాలయంలో సోమవారం మహిళా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలపై లైంగికదాడులు జరుగుతూనే ఉన్నాయని వాటిని నియంత్రించాలని కోరారు. గతంలో మహిళల హక్కులు, రక్షణ, స్వేచ్ఛ కోసం జరిగిన పోరాటంలో హక్కులు సాధించుకున్నామని అందుకనే మార్చి, 8న జాతీయ మహిళా దినోత్సవంగా జరుపుకుంటున్నామని తెలిపారు.

అన్ని రంగాల్లో పనిచేస్తున్న మహిళా కార్మికులు ఎన్నో సమస్యలు ఎదుర్కొంటున్నారని వాటిని పరిష్కరించుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి మన్మథరావు, శ్రామిక మహిళా సంఘం నాయకురాలు ఇందిర, మహిళలు పాల్గొన్నారు.

ప్రజావసరాల పరిష్కార బాధ్యత గృహ సారథులదే

- ఎమ్మెల్యే అలజంగి జోగారావు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జోగారావు

పార్వతీపురం టౌన్: ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరువ చేసేందుకు గృహసారథులు రథసారథుల్లా పని చేయాలని ఎమ్మెల్యే జోగారావు కోరారు. ఈ మేరకు పార్వతీపురం పురపాలక సంఘం పరిధిలోని 12వ వార్డు సచివాలయానికి చెందిన 23, 24 వ వార్డుల కన్వీనర్లు, గృహ సారథులు, కార్యకర్తలతో సోమవారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారి బాధ్యతలు, విధి విధానాలు, పార్టీ అభివృద్ధిలో వారి భాగస్వామ్యంపై కూలంకుషంగా వివరించడంతో పాటు ఈనెల 18వ తేదీ నుంచి గృహ సారథులంతా ఇంటింటికి వెళ్లి నిర్వహించబోయే 'జగన్ అన్నే మా భవిష్యత్తు' ప్రచార కార్యక్రమం నిర్వహణపై అనుసరించాల్సిన విధి విధానాలపై తెలియజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు కొండపల్లి బాలకృష్ణ, పార్టీ మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ మంత్రి రవికుమార్, పట్టణ జేసీఎస్ కన్వీనర్ గొర్లి మాధవరావు, ఏఎంసీ వైస్‌చైర్మన్ వానపల్లి శంకర్రావు, వార్డుల ఇన్‌చార్జిలు, పార్టీ సీనియర్ నాయకులు, సచివాలయం కన్వీనర్లు, వార్డు గృహ సారథులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జాతర మహోత్సవాన్ని జయప్రదం చేయాలి



పోస్టర్‌ను విడుదల చేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

గుమ్మలక్ష్మీపురం: మండల కేంద్రంలోని ఉమా సహిత కైలాసనాథ ఆలయ 40వ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించే పంచమరాత్రి జాతర మహోత్సవాలను విజయవంతం చేయాలని సర్పంచ్ బొత్తాడ గౌరీశంకరరావు, ఆలయ కమిటీ సభ్యులు కొత్తకోట విష్ణు, మద్ది దొరబాబు, పైడా నాగేశ్వరరావు కోరారు. ఈమేరకు సోమవారం ఆలయం వద్ద జాతర మహోత్సవాలకు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. ఈనెల 17 నుంచి 21వ తేదీ వరకు ప్రతీరోజు ప్రత్యేక పూజా కార్యక్రమాలతో పాటు వినోద కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. చుట్టుపక్కల గ్రామస్తులు జాతరకు విచ్చేసి జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు పైడా జగదీష్, నాగరాజు, గుడ్ల హరిప్రసాద్, వైస్ సర్పంచ్ కిశోర్ తదితరులున్నారు.

లివిరిలో డోలోత్సవ సంసిద్ధత పూజలు



భామిని: వంశధార నదీ తీరంలో ప్రముఖ వైష్ణవాలయంగా గుర్తింపు పొందిన లివిరి గోపీనాథ రాధాకృష్ణ మందిరంలో నేటి నుంచి డోలోత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో సోమవారం ఉత్కళ సంప్రదాయంలో డోలోత్సవాల సంసిద్ధత పూజలను ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో హోమాధికారాలు నిర్వహించారు. ఉత్సవమూర్తులను పంచామృతాలతో అభిషేకించి పల్లకిలో తిరువీధి నిర్వహించారు. ఈ నెల 7 నుంచి 15 వరకు డోలోత్సవాలు నిర్వహించనున్నారు. తొలిరోజు కామదహన కార్యక్రమంతో ఈ ఉత్సవాలు ప్రారంభిస్తారు. ఉత్సవాలకు ఆంధ్రా–ఒడిశా సరిహద్దు ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి మొక్కులు చెల్లించుకోనున్నారు.

పరీక్ష హాల్లో మొబైల్స్, గాడ్జెట్స్ నిషేధం

పార్వతీపురం టౌన్: ఇంటర్మీడియట్ పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు మొబైల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ గాడ్జెట్లను పరీక్ష హాల్లోకి తీసుకురాకూదని జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఆకులరాజు స్పష్టం చేశారు. ఈ మేరకు సోమవారం స్థానిక జూనియర్ కళాశాలలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈనెల 15వ తేదీ నుంచి జరగనున్న ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల్లో సిబ్బంది, విద్యార్థుల మొబైల్ ఫోన్ల వినియోగాన్ని పూర్తిగా నిషేధించినట్లు స్పష్టం చేశారు. విద్యార్థులు మొబైల్ ఫోన్లను గాని, డిజిటల్ వాచ్‌లు, ఫిట్‌నెస్ బ్యాండులు, బ్లూటూత్ డివైస్‌లు, ఇయర్ ఫోన్లు వంటివి వినియోగిస్తే వారిపైన మాల్ ప్రాక్టీస్ కేసు నమోదు చేస్తామని తెలిపారు. పరీక్షా కేంద్రంలోని చీఫ్ సూపరింటెండెంట్‌కు బోర్డు వారే ఒక బేసిక్ ఫోన్‌ను ఇస్తారని తెలిపారు. అత్యవసర సమయాల్లో మాత్రమే ఆ ఫోన్‌ను వినియోగించే విధంగా ఇంటర్మీడియట్ బోర్డు నిబంధనల మేరకు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పరీక్షా సిబ్బంది గానీ, బందోబస్తులో ఉన్న పోలీసులు గానీ, మెడికల్ డిపార్ట్‌మెంట్ నుంచి వచ్చే ఏఎన్ఎంలు గానీ పరీక్షా కేంద్రంలో మొబైల్ ఫోన్‌ను వినియోగించినట్‌లైతే వారిపై కూడా కఠిన చర్యలు తీసుకుంటామని, ఇంటర్ బోర్డ్ సెక్రటరీ నిబంధనలను జారీ చేశారన్నారు. పార్వతీపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 36 సీసీ కెమెరాలను అన్ని గదులు వరండాలు, కళాశాల ప్రాంగణంలోని బహిరంగ ప్రదేశాలలో అమర్చినట్లు తెలియజేశారు.

ఉగాది రోజున సామూహిక గృహప్రవేశం

- లబ్ధిదారులు సిద్ధం కావాలి: డీఈఈ



మిర్తివలసలో లబ్ధిదారులతో మాట్లాడుతున్న డీఈఈ ప్రసాదుబాబు

బలిజిపేట: ఈ నెలలో రానున్న నూతన తెలుగు సంవత్సరం ఉగాది పర్వదినాన నూతన గృహప్రవేశాల కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని హౌసింగ్ డీఈఈ ప్రసాద్‌బాబు పిలుపునిచ్చారు. ఈ మేరకు బలిజిపేట మండలంలోని మిర్తివలసలో లబ్ధిదారులతో సోమవారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నూతన గృహప్రవేశ కార్యక్రమం సమయానికి అరకొరగా మిగిలి ఉన్న ఇళ్ల పనులను పూర్తిచేయాలని సూచించారు. అసంపూర్తి నిర్మాణాలను పూర్తిచేసి ఎంతో సంబరంగా గృహప్రవేశం జరుపుకోవాలని విజ్ఞప్తి చేశారు. లబ్ధిదారులు త్వరితగతిన నిర్మాణాలు పూర్తి చేసేందుకు సిబ్బంది సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీఓ భానుమూర్తి, మండల వ్యవసాయ సలహా సంఘం అధ్యక్షుడు గంగయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

సీతానగరంలో..

సీతానగరం: మండలంలో జగనన్న కాలనీల్లో నిర్మిస్తున్న ఇళ్లలో ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని లబ్ధిదారులు గృహప్రవేశాలకు సిద్ధం కావాలని ఎంపీడీఓ బి.కృష్ణ మహేష్‌రెడ్డి కోరారు. ఈ మేరకు సోమవారం ఆయన అప్పయ్యపేట జగనన్న కాలనీల్లో జరుగుతున్న ఇళ్ల నిర్మాణాలను పరిశీలించిన లబ్ధిదారులతో మాట్లాడారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలోని జగనన్న కాలనీల్లో పూర్తి కావచ్చిన ఇళ్లలో ఉగాది పర్వదినం రోజున పండగ వాతావరణం వచ్చేలా గృహప్రవేశాలు నిర్వహించడానికి సిద్ధంగా ఉండాలని సూచించారు. ఉగాది రోజున జగనన్న కాలనీల్లో గృహప్రవేశం చెయ్యడానికి లబ్ధిదారులకు పంచాయతీ కార్యదర్శులు అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో స్థానిక ఎంపీటీసీ సభ్యురాలు బి.కుసుమ, వైఎస్సార్‌సీపీ మండల నాయకులు బి.సూర్యనారాయణ, పెదభోగిలి సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.



సీతానగరం: మాట్లాడుతున్న ఎంపీడీవో కృష్ణ మహేష్‌రెడ్డి